

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక


సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి బుధవారం 9-09-2026 సంపుటి: 02 సంచిక : 130 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Wednesday, 9-09-2026 Volume :02 Issue: 130 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ,
మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా
పని చేయుటకు ఆసక్తి, అనుభవం
ఉన్నవారు ఈ క్రింద నంబర్లకు కాల్
చేసి సంప్రదించగలరు.


Contact Number
9059328777


## మీ తల్లిని కాదు..నా తల్లిని

# అన్నారు

ఆవేశం మీకు కాదు..
నాకుండాలి

హరీశ్‌రావుపై
స్పీకర్ ఆగ్రహం



- మహిళా ఎమ్మెల్యేలపై దాడికి సమాధానం చెప్పాలన్న బీఆర్ఎస్
- ఘటనపై పూర్తి నివేదిక కోరామన్న శ్రీధర్ బాబు
- నివేదిక వచ్చిన తర్వాత చర్యలుంటాయన్న స్పీకర్
- స్పీకర్ పై వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలన్న కాంగ్రెస్
- స్పీకర్ అంటే తమకు చాలా గౌరవం ఉందన్న హరీశ్ రావు
- తాతా మధు స్పీకర్ ను ఉద్దేశించి అలా మాట్లాడలేదు
- స్పీకర్ అలా భావిస్తే విచారం వ్యక్తం చేస్తున్నామన్న హరీశ్
- పోలీసులపై కేటీఆర్ దాడి చేశారన్న మంత్రి సీతక్క
- ఈ వివాదాలను ఇంతటితో ఆపాలన్న ఏలేటి
- శాసన సభలోవాడీ వేడి చర్చ

హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం ఉదయం జరిగిన ఘటనలపై మంగళవారం కూడా సభలో వాగ్యుద్ధం జరిగింది. ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి అంటూ..ఒక దశలో స్పీకర్ ప్రసాద్‌కుమార్.. హరీశ్‌రావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో రోజు సభ ప్రారంభమైన వెంటనే నల్లబ్యాడ్జీలతో బీఆర్ఎస్ సభ్యులు హాజరయ్యారు. సీనియర్ మహిళా సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించిన పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సభ్యులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. తిరిగి వారిపైనే అక్రమ కేసులు పెట్టారని ఆవేశంగా మాట్లాడారు. రాష్ట్రంలోని యావత్ మహిళలపై జరిగిన దాడిగా దీన్ని పరిగణిస్తున్నామన్నారు. "

-మిగతా 2 లో



## కలియుగ దుశ్శాసనుడు

# రేవంత్

- గౌరవ సభను కౌరవ సభగా మార్చారు
- మహిళా ఎమ్మెల్యేలను అవమానించారు:హరీశ్
- దాడికి గురైన వారిపై ఉల్టా కేసులు
- కేసీఆర్ ఇంటిపై దాడికి యత్నం శోచనీయం.. మహానేత చావు కోరుకోవడం బాధాకరం
- కాంగ్రెసొచ్చాకే అన్నివర్గాల కష్టాలు
- గొంతునొక్కినా గళమెత్తుతాం
- సర్కార్ వైఫల్యాలు బయటపెడ్తం
- అసెంబ్లీలో బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 /మేడ్చల్

రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి కలియుగ దుశ్శాసనుడని, గౌరవ సభను కౌరవ సభగా మార్చిన ఘనత ఆయనకే దక్కిందని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలో, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ మహిళా సభ్యులు సబితా ఇంద్రారెడ్డి గొంతుపిసికి, సునీతాలక్ష్మారెడ్డి చీరలాగి మహిళా లోకాన్ని అవమానించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాడికి గురైన మహిళా ఎమ్మెల్యేలపైనే రివర్స్‌లో కేసులు పెట్టారని మండిపడ్డారు. స్పీకర్ అంటే గౌరవం ఉన్నదని చెప్పినా తమ సభ్యుడిని అరెస్ట్ చేయడం దారుణమని మండిపడ్డారు

-మిగతా 2 లో



02

## పొగ తాగకపోయినా బలవుతున్నారు!

- పరోక్ష ధూమపానంతో పెరుగుతున్న ముప్పు
- 33 ఏళ్లలో 50 శాతం పెరిగిన మరణాలు
- 2023లో 44.4 కోట్ల మందిపై ప్రభావం
- పిల్లల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు
- 3.25 లక్షలకు చేరిన మరణాలు
- గుండె, శ్వాసకోశ వ్యాధుల ముప్పు అధికం
- 204 దేశాల్లో అధ్యయనం చేసిన పరిశోధకులు



02

## బ్రిక్స్‌లో భారత్ కొత్త ఎజెండా

- వాణిజ్యం నుంచి ఏఐ వరకు ఫోకస్
- 12, 13 తేదీల్లో ఢిల్లీలో 18వ బ్రిక్స్ సదస్సు
- 11 సభ్య దేశాలతో విస్తరించిన బ్రిక్స్‌కు భారత్ నాయకత్వం
- ఇంధన భద్రత, వాతావరణ మార్పులు,. అభివృద్ధి ఫైనాన్స్‌పైనా చర్చలు



02

## కష్టాల్లో సౌత్ జోన్

- విజృంభించిన షమీ, ముఖేష్
- పోరాడుతున్న తిలక్ వర్మ
- పడిక్కల్ హాఫ్ సెంచరీ
- మూడో రోజూ ఈస్ట్ జోన్ దే జోరు
- సౌత్ జోన్ తో దులీప్ ట్రోఫీ ఫైనల్

# టెన్షన్..టెన్షన్

ఎర్రవెల్లి టూ బోయిన్‌పల్లివరకు రాజకీయ కాక

- కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించిన కాంగ్రెస్ నేతలు
- అడ్డుకున్న పోలీసులు..? మాజీ సీఎం వ్యవసాయ క్షేత్రం చుట్టూ పహారా
- కేసీఆర్‌కు రక్షణగా కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు
- రెండు పార్టీల పరస్పర నిరసనలతో ఉద్రిక్తత
- బీఆర్ఎస్ ముఖ్యనేతలను అరెస్టు చేసిన పోలీసులు
- పోలీసుల అదుపులో కేటీఆర్, హరీశ్‌రావు, తదితరులు..సాయంత్రానికి విడుదల
- కేసీఆర్ హత్యకు కుట్రలు : కేటీఆర్
- పాలక, ప్రతిపక్షాలకు వేర్వేరు నిబంధనలా? -హరీశ్‌రావు

తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అసెంబ్లీ వేదికగా మొదలైన అధికార, ప్రతిపక్షాల వార్ చివరకు రోడ్డెక్కింది. స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారన్న నిరసనతో కాంగ్రెస్ ఎస్సీ సెల్ శ్రేణులు ఎర్రవెల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇరువర్గాల పోటాపోటీ నిరసనలు, దిష్టిబొమ్మల దహనాలతో ఎర్రవెల్లి పరిసరాలు రణక్షేత్రాన్ని తలపించాయి. మరోవైపు, కేసీఆర్‌ను కలిసేందుకు అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లికి బయలుదేరిన కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకుని అరెస్టు చేయడం రాజకీయంగా కలకలం రేపింది. హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే తమ గొంతు నొక్కుతున్నారని బీఆర్ఎస్ నేతలు మండిపడగా, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ముందస్తు చర్యలు చేపట్టామని పోలీసులు స్పష్టం చేశారు.

మర్కుక్/కంటోన్మెంట్/జవహర్‌నగర్

అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బ్లాక్ టీషర్ట్స్‌తో మొదలెట్టిన నిరసన.. అటు ఇటు తిరిగి చివరకు మంగళ వారం కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు ముట్టడించే వరకు వెళ్లింది. ఇరుపార్టీల కార్యకర్తల ఆందోళనలతో ఎర్రవెల్లి రణక్షేత్రంగా మారింది. దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మర్కుక్ మండలం ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రాన్ని ముట్టడించారు. కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు,

-మిగతా 2 లో






## మంత్రుల శాఖలన్నీ మార్చాలని సూచించా

- క్యాబినెట్ విస్తరణపై అధిష్ఠానానిదే తుది నిర్ణయం
- నన్ను మంత్రివర్గంలోకి తీసుకోవాలా? వద్దా? అధిష్ఠానమే నిర్ణయిస్తుంది
- పీసీసీ అధ్యక్షుడిగా నా బాధ్యతలు కొనసాగుతున్నాయి
- శాఖల మార్పుపై సీఎం, అధిష్ఠానం నిర్ణయం
- పార్టీని సమర్థంగా నడపడమే నా లక్ష్యం
- బీసీ నాయకుడే సీఎం అవుతారు
- కాంగ్రెస్‌లోనే బీసీ సీఎం సాధ్యం: మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్,

: ప్రస్తుత రాష్ట్ర క్యాబినెట్‌లోని మంత్రుల శాఖలన్నింటిని మార్చాలని తాను కాంగ్రెస్ అధిష్ఠానానికి సూచించానని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. క్యాబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై కీలక వ్యాఖ్యలు చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా తానూ చేయాల్సింది, సూచించాల్సింది అంతవరకేనని పేర్కొన్నారు. మిగిలిన నిర్ణయాలన్నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని స్పష్టం చేశారు.క్యాబినెట్ విస్తరణ లేదా శాఖల కేటాయింపు అనేది పూర్తిగా అధిష్ఠానం పరిధిలోని అంశమని చెప్పారు. తనను మంత్రివర్గంలోకి తీసుకోవాలా? వద్దా? అనే విషయాన్ని పూర్తిగా అధిష్ఠానానికే వదిలేశామని అన్నారు. ప్రస్తుతం తనకు పార్టీని నడిపించే అత్యంత బాధ్యతాయుతమైన పీసీసీ

-మిగతా 2 లో



## కొత్త మ్యాప్‌లో భారత్‌కు ఐరాస బిగ్ షాక్..!

- కొత్త ప్రపంచ మ్యాప్‌లో భారత్‌కు షాక్
- అరుణాచల్, అక్సాయ్‌చిన్ ప్రత్యేక ప్రాంతాలుగా చిత్రీకరణ
- పీఓకే, కాశ్మీర్ సరిహద్దులపై వివాదాస్పద సూచనలు
- దేశ సరిహద్దుల రూపురేఖల్లో మార్పులపై కలకలం
- అరుణాచల్‌కు నాగాలాండ్ సరిహద్దు తొలగింపు
- అక్సాయ్‌చిన్‌ను స్వతంత్ర విభాగంగా చూపింపు
- కాశ్మీర్‌పై నియంత్రణ రేఖను చుక్కల గీతతో సూచన
- క్షేత్రస్థాయి వాస్తవాలను వక్రీకరిస్తే తీవ్ర నిరసన: భారత్
- జమ్మూకాశ్మీర్, లడఖ్, అక్సాయ్‌చిన్, అరుణాచల్ భారత్‌లో అంతర్భాగమే


న్యూఢిల్లీ

దాదాపు 500 ఏళ్ల తర్వాత ప్రపంచ మ్యాప్ ను సవరించేందుకు వీలుగా ఐక్యరాజ్యసమితిలో ఓ తీర్మానం ఆమోదించారు. దీనికి భారత్ కూడా మద్దతిచ్చింది. అయితే ప్రస్తుతం భారత్ మ్యాప్ లో ఉన్న ప్రాంతాలన్నీ యథాతథంగా ఉండాలని ఆ తర్వాత కోరింది. అయితే తాజాగా ఐరాస విడుదల చేసిన మ్యాప్ లో మాత్రం భారత్ కు గట్టి షాక్ తగిలింది. దీనికి కారణం భారత్ భూభాగమైన అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ వంటి పలు ప్రాంతాలు ఇప్పుడు ఈ మ్యాప్ లో కనిపించడం లేదు.

-మిగతా 2 లో

## ప్రధాని భద్రతలో కలకలం

- మోదీ ముంబయి పర్యటనకు ముందు అనూహ్య ఘటనలు
- వేదిక వద్ద అనుమానాస్పదంగా తిరిగిన ఇద్దరి అరెస్ట్
- ఒకరి వద్ద నకిలీ పీఎంవో ఐడీ కార్డు
- మరో వ్యక్తి వద్ద తుపాకీ స్వాధీనం
- పోటోకాల్ డ్రిల్ వేళ అప్రమత్తమైన భద్రతా సిబ్బంది
- నిందితుడిని రోహన్ పరేఖ్‌గా గుర్తించిన పోలీసులు
- బీకేసీ మాల్ ఘటనలో మరో ముగ్గురి అరెస్ట్
- మాల్ ఘటనకు మోదీ కార్యక్రమంతో సంబంధం లేదన్న పోలీసులు



02

## 4 నెలల్లో 23 మందికి ఉరిశిక్ష!

- యూపీలో ఓ ఫాస్ట్‌ట్రాక్ జడ్జి రికార్డు



02

## కొత్త మ్యాప్‌లో భారత్‌కు ఐరాస బిగ్ షాక్..!

మొదటి తరువాయి

ఐరాసలో ఆఫ్రికన్ యూనియన్ ప్రతిపాదించిన కరెక్ట్ ది మ్యాప్ తీర్మానానికి భారత్ మద్దతు తెలిపినప్పటికీ, ఈ కొత్త మ్యాప్ లో దేశ సరిహద్దులను వివాదాస్పదంగా చూపించడం కలకలం రేపుతోంది. ముఖ్యంగా భారత్ అంతర్భాగంగా భావించే అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాలను భారత్, చైనా సరిహద్దుల మధ్య ఉన్న ప్రత్యేక స్వతంత్ర సరిహద్దు ప్రాంతాలుగా చూపించడం వివాదానికి దారితీసింది. ఈ కొత్త పటంలో ఈ రెండు ప్రాంతాల అంతర్గత రూపురేఖలను మార్చేశారు. అరుణాచల్ ప్రదేశ్ కు నాగాలాండ్ తో ఉన్న సరిహద్దును తొలగించి, దాన్ని కేవలం అస్సాం, చైనా సరిహద్దులతో ముడిపడి ఉన్న స్వతంత్ర ప్రాంతంగా చూపించారు. అలాగే అక్సాయ్ చిన్ ను కూడా పశ్చిమాన భారత్ తో, తూర్పున చైనాతో సరిహద్దులు కలిగిన స్వతంత్ర విభాగంగా ప్రతిపాదించారు. అయితే ఈ సరిహద్దు మార్పులకు గల కారణాలను ఐక్యరాజ్యసమితి ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. అలాగే జమ్మూ కాశ్మీర్ అంశాన్ని కూడా ఐరాస ప్రస్తావించింది. భారత్, పాకిస్తాన్ మధ్య ఉన్న నియంత్రణ రేఖను చుక్కల గీతతో సూచించింది. కాశ్మీర్ తుది స్థితిపై ఇరు దేశాల మధ్య ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదని మ్యాప్ దిగువన ఒక గమనిక ద్వారా పేర్కొంది. దీనిపై భారత్ స్పందిస్తూ.. క్షేత్రస్థాయి వాస్తవాలను ఏ రూపంలో తప్పుగా చూపించే ప్రయత్నాలనైనా తీవ్రంగా నిరసిస్తామని స్పష్టం చేసింది. దీనిపై స్పందించిన భారత్.. జమ్మూ కాశ్మీర్, లడఖ్, అక్సాయ్ చిన్ తో పాటు అరుణాచల్ ప్రదేశ్ భారత్ లో అంతర్భాగమని పునరుద్ఘాటించింది.

## మంత్రుల శాఖలన్నీ మార్చాలని సూచించా

మొదటి తరువాయి

అధ్యక్ష పదవి ఉన్నదని, ఆ బాధ్యతను సమర్థంగా నిర్వహించేందుకు శక్తివంచనలేకుండా కృషిచేస్తున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీ నాయకుడు ముఖ్యమంత్రి అవుతారని, అది కాంగ్రెస్‌లోనే సాధ్యమని వ్యాఖ్యానించారు.

## ప్రధాని భద్రతలో కలకలం

ముంబై



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముంబయి పర్యటన నేపథ్యంలో కీలక పరిణామం జరిగింది. మోడీ పాల్గొనే కార్యక్రమం వేదిక వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నకిలీ పీఎంఓ ఐడీ కార్డు, ఒక తుపాకిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో ప్రధాని రాకకు ముందే ముంబయిలో హై అలర్ట్ ప్రకటించారు. సోమవారం రాత్రి భద్రతా దళాలు ప్రోటోకాల్ డ్రిల్ నిర్వహిస్తుండగా ఈ ఘటన జరిగింది.

మంగళవారం సాయంత్రం ముంబయిలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోడీ పాల్గొనాల్సి ఉంది. అయితే, వేదిక వద్ద ప్రధాన మంత్రి కార్యాలయానికి చెందిన అధికారిగా చెప్పుకుంటూ తిరుగుతున్న వ్యక్తులు బీకేసీలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లోకి ప్రవేశించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది వారిద్దరి అనుమానాస్పద ప్రవర్తనను గమనించి అడ్డుకున్నారు. వారివద్ద ఉన్న ఐడీ కార్డులను తనిఖీ చేసి నకిలీవని గుర్తించారు. అనంతరం వారిద్దరిని ముంబయి పోలీసులకు అప్పగించారు. అనుమానితుడిని రోహన్ పరేఖ్‌గా పోలీసులు గుర్తించారు.

'షాపింగ్? మాల్' ఘటనకు మోడీ ఈవెంట్‌కు సంబంధం లేదు'

ఇదిలా ఉండగా, ముంబయిలో బీకేసీలో ఉన్న ఒక షాపింగ్ మాల్‌లోకి తుపాకీతో ప్రవేశించడానికి ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. అయితే, ఈ ఘటన సోమవారమే బీకేసీలోని 'జియో వరల్డ్ ప్లాజా'లో జరిగిందని, దీనికి ప్రధాని కార్యక్రమంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఓ అధికారి తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం షాపింగ్ ప్లాజాలో ఉన్న ఓ షాపింగ్ మాల్‌లోకి గుర్తుతెలియని ముగ్గురు అనుమానితులు ప్రవేశించడానికి యత్నించారు. భద్రతా సిబ్బంది వారిని అడ్డుకోగా, వారు అనుమానాస్పదంగా ఉన్న ప్రభుత్వ గుర్తింపు కార్డును చూపించి, గార్డులతో వాదించి, బలవంతంగా లోపలికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మాల్ సెక్యూరిటీని తుపాకీ చూపించి బీకేసీలోని జియో వరల్డ్ ప్లాజాలోకి బలవంతంగా ప్రవేశించారు. అనంతరం విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నిందితులను అరెస్టు చేశారు. అయితే, నిందితుల వద్ద లభించిన ఆయుధానికి లైసెన్స్ ఉన్నట్లు తేలిందని, ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకోవడానికి దర్యాప్తును ముమ్మరం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

## 4 నెలల్లో 23 మందికి ఉరిశిక్ష!

### యూపీలో ఓ ఫాస్ట్‌ట్రాక్ జడ్జి రికార్డు

ముజఫర్‌నగర్(యూపీ), సెప్టెంబర్ 8



నాలుగు నెలల్లో 23వ ఉరిశిక్షను ఒక వరకట్న మరణ కేసులో విధించిన అదనపు జిల్లా సెషన్స్ జడ్జి రవికుమార్ దివాకర్ పిరికి న్యాయమూర్తి అని పిలిపించుకోవడం కంటే చావే మేలని అన్నారు. వరకట్నం కోసం తన భార్యను తగలబెట్టిన నదీమ్‌కు మరణశిక్ష విధిస్తూ మాఫియాలు, గ్యాంగ్‌స్టర్లు లేదా నేరస్థుల ఒత్తిడికి లొంగిపోయి తాను తన న్యాయ విధులను నిర్వర్తించబోనని జడ్జి చెప్పారు. ఫాస్ట్-ట్రాక్ కోర్టు జడ్జి మాట్లాడుతూ దేవుడికి తప్ప మరెవరికీ భయపడకూడదని తన తల్లిదండ్రులు తనకు నేర్పించారని, బలవంతులు, మాఫియాలు, గ్యాంగ్‌స్టర్లు లేదా నేరస్థులకు భయపడి వ్యవహరించడం న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. పిరికివాడైన న్యాయమూర్తిగా ముద్రపడటం కంటే మరణించడమే మేలని, తన సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయగలిగినంత కాలం తన విధులను కొనసాగిస్తానని దివాకర్ పేర్కొన్నారు.

## కలియుగ దుశ్శాసనుడు రేవంత్

మొదటి తరువాయి

దళితులపై కాంగ్రెస్‌కు నిజంగా ప్రేముంటే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఏమైంది..? అంబేద్కర్ విగ్రహానికి తాళాలెందుకు వేశారు? అని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని పోలీసులు పరిశీలిస్తారని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పడం ఆక్షేపణీయమని మండిపడ్డారు. సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిపై దాడి ఘటనలో ఎలాంటి విచారణ జరుపకపోవడం బాధాకరమని విమర్శించారు. స్పీకర్ అంటే ఎంతో గౌరవమున్నదని, వ్యక్తిగతంగా ఉన్న అభిమానం స్పీకర్ మనసుకూ తెలుసునని పేర్కొన్నారు. తాతామధు స్పీకర్‌ను ఏం అనలేదని, ఒకవేళ నొచ్చుకొని ఉంటే పార్టీ తరఫున కూడా విచారం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు.ావస్త్రఅంశ్రీఖ్అజవ దీఖ్షుఅవ్ష్ట్ర

కేసీఆర్ ఇంటిపై దాడి వికృత చర్య

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటిపై కాంగ్రెస్ శ్రేణుల దాడి వికృత చర్య అని హరీశ్‌రావు మండిపడ్డారు. జవహర్‌నగర్ పీఎస్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాణిక్‌రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలు బట్టబయలవుతాయనే సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని దుయ్యబట్టారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్ మీడియాతో చిట్‌చాట్ చేసి మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరుగలేదనడం ఏంది? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బీజేపీ సభ్యులు ప్లకార్డులు తీసుకువెళ్తే అడ్డుకోలేదని, తాము టీ షర్ట్‌లు వేసుకుంటే అడ్డుకున్నారని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్ మైత్రీ బంధానికి ఇదే నిదర్శనమని స్పష్టంచేశారు. రాష్ట్రానికి హోంమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి మహిళా ఎమ్మెల్యేలపై దాడికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, కేంద్రం, గవర్నర్ జోక్యం చేసుకొా ని రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరారు. రాష్ట్ర పరిస్థితులపై రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు

# కష్టాల్లో సౌత్ జోన్

- విజృంభించిన షమీ, ముఖేష్
- పోరాడుతున్న తిలక్ వర్మ
- పడిక్కల్ హాఫ్ సెంచరీ
- మూడో రోజు ఈస్ట్ జోన్ దే జోరు
-- సౌత్ జోన్ తో దులీప్ ట్రోఫీ ఫైనల్



చెన్నై:

ఈస్ట్ జోన్ తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ-2026 ఫైనల్లో సౌత్ జోన్ కష్టాల్లో పడింది. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన ఈస్ట్ జోన్ మొదటి ఇన్నింగ్స్ లో 708 పరుగుల భారీ స్కోరు సాధించింది. సారథి ఇషాన్ కిషన్ (270) విధ్వంసకర డబుల్ సెంచరీతో సత్తా చాటాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన సౌత్ జోన్.. మంగళవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ప్రస్తుతం సౌత్.. ఈస్ట్ టీమ్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 466 పరుగులు వెనుకబడి ఉంది. కెప్టెన్ తిలక్ వర్మ (56 బ్యాటింగ్; 133 బంతుల్లో 5 ఫోర్లు) పోరాడుతున్నాడు. అంతకుముందు దేవదత్ పడిక్కల్ (62; 104 బంతుల్లో 4 ఫోర్లు) కీలకమైన అర్ధ శతకం చేసి అవుటయ్యాడు. పడిక్కల్, తిలక్ మినహా మిగతా బ్యాటర్లందరూ విఫలమయ్యారు. ఈస్ట్ బౌలర్లలో స్టార్ పేసర్లు మహమ్మద్ షమీ (2/17), ముఖేష్ కుమార్ (2/36) వికెట్లతో విజృంభించి బౌలింగ్ చేశారు.

ఆదుకున్న దేవదత్..

మంగళవారం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్ కు ఆదిలోనే భారీ షాక్ తగిలింది. ఓపెనర్ రికీ భుయ్ (1) ను ప్రత్యర్థి బౌలర్ ముఖేష్ కుమార్ తక్కువ స్కోరుకే పెవిలియన్ కి పంపించాడు. దీంతో ఈస్ట్ జోన్ కేవలం 10 స్కోరుకే తొలి వికెట్ కోల్పోయింది. ఈ దశలో వన్ డౌన్ లో వచ్చిన దేవదత్ పడిక్కల్ సూపర్ బ్యాటింగ్ తో సౌత్ ఇన్నింగ్స్ ను ఆదుకున్నాడు. మరో ఓపెనర్ నారాయణ్ జగదీశన్ తో కలిసి స్కోరు బోర్డును ముందుకు సాగించాడు. పడిక్కల్ కాస్త ఆచితూచి ఆడినా.. జగదీశన్ మాత్రం వరుస బౌండరీలతో చెలరేగాడు. ఈ క్రమంలోనే వీరు రెండో వికెట్ కు 60 పరుగుల భాగస్వామ్యం ఏర్పరుచుకున్నారు. అయితే, ఈ దశలో పుంజుకున్న ఈస్ట్ బౌలర్ శిఖర్ మోహన్ అదిరే బంతితో జగదీశన్ (32) ను ఇంటిబాట పట్టించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన షేక్ రషీద్ తో కలిసి పడిక్కల్ మరో కీలక భాగస్వామ్యం నెలకొల్పే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలోనే బాధ్యతగా ఆడుతున్న దేవదత్ 65 బంతుల్లో 4 ఫోర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఆ కొద్దిసేపటికే ముఖేష్ కుమార్ బౌలింగ్ లో భారీ షాట్ కు ప్రయత్నించిన పడిక్కల్ 62 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద దాస్ కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అదే సమయంలో మరో సెట్ బ్యాటర్ రషీద్ (27) ను షమీ అదిరే బంతితో ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి సౌత్ జోన్ కు ఇంకో భారీ షాకిచ్చాడు. ఈ కఠిన సమయంలో మైదానంలోకి అడుగుపెట్టిన సారథి తిలక్ వర్మ చిరస్మరణీయ బ్యాటింగ్ తో ఆదుకునే ప్రయత్నం చేశాడు. రవిచంద్రన్ స్మరణ్ (55 బంతుల్లో 23) తో కలిసి 5వ వికెట్ కు 45 పరుగులు జోడించాడు. అనంతరం కుదురుగా ఆడుతున్న రవిచంద్రన్ ను కూడా షమీ పెవిలియన్ కి పంపాడు. 174 స్కోరుకే కీలకమైన 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిపోయిన సౌత్ ను తిలక్ వర్మ కెప్టెన్ ఇన్నింగ్స్ తో ఆదుకున్నాడు. ఒకవైపు వరుసగా వికెట్లు పడుతున్నా అతడు మాత్రం ప్రత్యర్థి బౌలర్లకు చెమటలు పట్టిస్తూ కీలకమైన పరుగులతో సత్తా చాటాడు. శ్రేయస్ గోపాల్ (26) తో కలిసి ఆరో వికెట్ కు 66 పరుగుల కీలకమైన భాగస్వామ్యాన్ని ఏర్పరిచాడు. అనంతరం భురేషి బౌలింగ్ లో గోపాల్ వెనుదిరిగినా.. తిలక్ మాత్రం బాధ్యతగా ఆడుతూ 123 బంతుల్లో 5 ఫోర్ల సహాయంతో అర్ధ శతకం సాధించాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ 80 ఓవర్లలో 242/6 స్కోరు నమోదు చేసింది. తిలక్ వర్మ (56), సీవీ మిలింద్ (2) అజేయంగా క్రీజులో ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ, ముఖేష్ చెరో 2 వికెట్లు పడగొట్టగా.. మోహన్, భురేషి తలో వికెట్ దక్కించుకున్నారు

# టెన్షన్..టెన్షన్

మొదటి తరువాయి

కార్యకర్తలు భారీ సంఖ్యలో ఎర్రవెల్లికి తరలివచ్చారు. మర్కుక్ మండలం వరదరాజ్‌పూర్ గ్రామం వైపు నుంచి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఫామ్‌హౌస్ వైపు కదిలారు. పార్టీ జెండాలు పట్టుకుని, డప్పుల మోతల మధ్య కార్యకర్తలు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. 'కేసీఆర్ డౌన్ డౌన్' అంటూ ఎర్రవల్లి పరిసరాలు రాజకీయ నినాదాలతో మార్మోగాయి. కాగా వరదరాజపూర్ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా రేవంత్‌రెడ్డి, కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది.

భారీగా పోలీసుల మోహరింపు

కాంగ్రెస్ కార్యకర్తలు ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. నిరసనకారులు ముందుకు వెళ్లకుండా పోలీసులు పలు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు.

గజ్వేల్‌లో సైతం ఉద్రిక్తత

కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు, పార్టీ శ్రేణులు గజ్వేల్ నుంచి డప్పులతో ఫామ్ హౌస్ వైపు పెద్దఎత్తున బయల్దేరారు. దాంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అలాగే కేసీఆర్‌కు రక్షణగా వెళ్తున్న గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులను సైతం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గజ్వేల్, ప్రజ్ఞాపూర్, శ్రీగిరిపల్లి, గణేష్‌పల్లి, అల్లిరాజ్ పేట్, సింగరాయపల్లి చౌరస్తా, గౌరారం, పాములపర్తిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు ఇరు పార్టీల శ్రేణులను చెదరగొట్టారు.

కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేల అడ్డగింత

ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లికి బయల్దేరడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తున్న వారిని హకీంపేట, బొల్లారం వద్ద పోలీసులు అరెస్టు చేశారు. కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, పద్మారావుగౌడ్, కాలేరు వెంకటేశ్, గూడెం మహిపాల్‌రెడ్డి తదితరులను బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాణిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి తదితరులను జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు విషయం తెలియడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీసు స్టేషన్లకు తరలివచ్చారు. హకీంపేట వద్ద బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి పర్యవేక్షణలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి నివాసం వద్ద భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా అరెస్టు చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలి : కేటీఆర్

ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడులు, అరెస్టులకు పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించిన తీరును ఖండించారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, మహిళలకు రూ.2,500, ఆడపిల్లలకు స్కూటీలు వంటి హామీలు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. హామీల అమలుపై అసెంబ్లీలో ప్రశ్నించాలని కేసీఆర్ తమకు సూచించారని తెలిపారు. సోమవారం అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని, మంగళవారం కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవెల్లి వెళ్తుంటే అడ్డుకున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలే ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారన్నారు.

## పొగ తాగకపోయినా బలవుతున్నారు!



న్యూఢిల్లీ: భారత్‌లో పరోక్ష ధూమపాన మరణాలు 1990తో పోలిస్తే 2003 నాటికి 50శాతం మేరకు పెరిగాయి. 2023లో భారత్‌లో 44.4 కోట్ల మంది పరోక్ష ధూమపానానికి గురైనట్లు ప్రపంచవ్యాప్త విశ్లేషణ వెల్లడించింది. ఆరోగ్యపరంగా పిల్లలకు ఇది గణనీయమైన ముప్పును కలిగిస్తున్నది. 1990లో పరోక్ష ధూమపానానికి గురైన వారి సంఖ్య 37.5 కోట్లుగా ఉండగా, 2023 నాటికి అది 44.4 కోట్లకు పెరిగిందని లాన్సెట్ పబ్లిక్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమైన విశ్లేషణ తెలియజేసింది. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్'(జీబీడీ) 2023 సెకెండ్ హ్యాండ్ స్మోక్ కొలాబరేషన్'గా ఏర్పడిన అంతర్జాతీయ పరిశోధకుల బృందం 204 దేశాల్లో పరోక్ష ధూమపానానికి గురయ్యే స్థాయి, దాని వల్ల కలిగే వ్యాధుల భారాన్ని అంచనా వేసింది. భారత్‌లో 1990లో పరోక్ష ధూమపానం కారణంగా నమోదైన మరణాలు 2,17,700 కాగా, 2023లో అవి 3,25,600కు పెరిగాయి. పరోక్ష ధూమపానానికి గురికావడం వల్ల గుండె, శ్వాసకోశ సంబంధిత సమస్యలు సహా పలు వ్యాధుల ముప్పు పెరుగుతుందని ఢిల్లీకి చెందిన ప్రముఖ వైద్యురాలు నీతూజైన్ 'పీటీఐ'కి తెలిపారు.

## బ్రిక్స్‌లో భారత్ కొత్త ఎజెండా

న్యూఢిల్లీ



వాణిజ్యం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)వరకు బ్రిక్స్ వేదికగా భారత్ తన ఎజెండాను ప్రపంచం ముందు పెట్టేందుకు సిద్ధమవుతోంది. బ్రిక్స్ కూటమికి 2026లో అధ్యక్షత వహిస్తున్న భారత్ ఈనెల 12, 13 తేదీల్లో ఢిల్లీలో 18వ శిఖరాగ్ర సదస్సును నిర్వహించనుంది. ఈ సదస్సులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, టెక్నాలజీ, ఇంధనం, వాతావరణం, అంతర్జాతీయ పాలనలో మార్పులపై కీలక చర్చలు జరపనుంది. అదే సమయంలో బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ అనే థీమ్‌ను భారత్ ఎంచుకుంది. సంక్షోభాలను తట్టుకునే ఆర్థిక వ్యవస్థలు, కొత్త సాంకేతికత, దేశాల మధ్య సహకారం, సుస్థిర అభివృద్ధి, ఆ నాలుగు అంశాల చుట్టూ బ్రిక్స్ సదస్సును ముందుకు తీసుకెళ్లాలని భారత్ భావిస్తోంది. దీనికి హ్యూమానిటీ ఫస్ట్ అనే దృక్పథాన్ని జోడించింది. బ్రిక్స్‌లో భారత్ ప్రధానంగా ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని చూస్తోంది. సభ్య దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంచడం, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలను తగ్గించడం, అంతర్జాతీయ చెల్లింపులను సులభతరం చేయడం ఇందులో కీలకం. జాతీయ కరెన్సీల వినియోగాన్ని పెంచడం, సరిహద్దు చెల్లింపుల వ్యవస్థలను మరింత అనుసంధానం చేయడం వంటి అంశాలపై కూడా చర్చలు జరగనున్నాయి. ప్రపంచ వాణిజ్యంలో ఎదురవుతున్న భౌగోళిక, రాజకీయ సవాళ్ల నేపథ్యంలో సరఫరా గొలుసులను మరింత పటిష్టం చేయడం భారత్ ఎజెండాలో ముఖ్యమైన అంశం. అంతేకాక చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కూడా బ్రిక్స్ సహకారం అందించాలనేది లక్ష్యం. ఇందుకోసం ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ విధానం, ఎంఎస్ఎంఈల కోసం ప్రత్యేక సహకార పోర్టల్ వంటి ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది

## మీ తల్లిని కాదు..నా తల్లిని అన్నారు

మొదటి తరువాయి

కలియుగ దుశ్శాసనుడిలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. గౌరవ సభ.. కౌరవ సభగా మారింది. ఆనాడు కౌరవులకు పట్టిన గతే రేపు.. కాంగ్రెస్ పార్టీకి పడుతుంది" అని తీవ్రంగా విమర్శించారు.

స్పీకర్ ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకుని.. హరీశ్‌రావు వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. "మహిళా సభ్యులంటే సభతో పాటు నాకు కూడా గౌరవం ఉంది. మీరు చెబితే నేను వినట్లేదా.. ఎందుకంత ఆవేశం. మీకు కాదు ఆవేశం.. నాకు ఉండాలి. నీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు" అని భావోద్వేగానికి గురయ్యారు. సబితా ఇంద్రారెడ్డి, సునీత, కోవా లక్ష్మి పట్ల తనకు కూడా గౌరవం ఉందన్నారు. నాకున్న ఎనిమిది మంది అక్కా చెల్లెళ్లతో పాటు వారు కూడా తన సోదరీమణులేనని పేర్కొన్నారు. మహిళా సభ్యులపై దురుసు ప్రవర్తనకు సంబంధించి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని స్పీకర్ స్పష్టంచేశారు. శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... మహిళా సభ్యులపై జరిగిన ఘటనపై రిపోర్ట్ ఇవ్వాలని స్పీకర్ పోలీసులను ఆదేశించారని వివరించారు. మహిళల పట్ల గౌరవం మాకూ ఉందన్నారు. తప్పు జరిగితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్పీకర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ సభ్యులు ఎందుకు ఖండించలేదని నిలదీశారు. స్పీకర్‌ను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సభను ఎలా నడపాలనే అంశంపై బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు అని చెప్పడానికి వాళ్లెవరు..?అని ప్రశ్నించారు. అనుకుంటే.. భావిస్తే ఏంటి.. వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది కదా?అని హరీశ్‌రావును ఉద్దేశించి ప్రశ్నించారు... మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిపై నివేదిక ఇవ్వాలని స్పీకర్ ఆదేశించారు.. స్పీకర్‌పై జరిగినదాన్ని పక్కనపెట్టాలని చెప్పటంతోనే ఆ ఘటనను వీరు ఎంత లైట్‌గా తీసుకుంటున్నారో అర్థమవుతుందని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పాల్సిన అవసరమేంటని బీఆర్ఎస్ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ గేట్ దగ్గర మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టింది ఎవరూ.. మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పింది ఎవరని ప్రశ్నించారు. స్పీకర్‌ను ఆయన తల్లిని దూషించి ఇప్పుడు లేదని దబాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులపై దాడులు చేయడం సబబేనా అనినిలదీశారు. అసెంబ్లీలో రూల్ తెచ్చిందే మీరు.. మీరే పాటించరా అని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లకారం భాషతో సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇక, తమ చీర లాగారు.. కొట్టారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చెబుతున్నారు.. నిజంగా మహిళా సభ్యులపై దాడి జరిగితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కూడా కేసులు పెడతామని చెప్పారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ స్పీకర్‌ను అవమానిస్తే సహించబోమన్నారు. ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ వ్యాఖ్యలపట్ల వారికి కనీస పశ్చాత్తాపమే లేదన్నారు. స్పీకర్ పదవిని అవమానించడం అంటే రాజ్యాంగ వ్యవస్థనే అవమానించడమన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు మాకు కూడా సోదరీమణులే.. వారిపై దాడిని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించమని చెప్పారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి






●హన్వాడ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మిడ్జిల్, సెప్టెంబర్ 8, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):
హన్వాడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, ప్రయోగశాలలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు తదితర అంశాలను పరిశీలించారు.
ముందుగా ఆసుపత్రికి ప్రతిరోజూ వస్తున్న బహిరంగ రోగుల సంఖ్యపై వైద్య అధికారిని అడిగి వివరాలు తెలుసుకున్న కలెక్టర్, అనంతరం ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పోషకాహారం, పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఆసుపత్రిలోని మందుల నిల్వలను పరిశీలించిన కలెక్టర్, రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అవసరమైన మందులు సక్రమంగా అందుతున్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల మందులు తగినంతగా అందుబాటులో ఉన్నాయా, ఏమైనా కొరత ఉందా అనే వివరాలను ఆరా తీశారు. ప్రస్తుతం మందుల నిల్వలు సరిపడా ఉన్నాయని వైద్యాధికారి కలెక్టర్‌కు తెలిపారు. తదుపరి ఆసుపత్రిలోని ప్రయోగశాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ నిర్వహిస్తున్న వివిధ రకాల వైద్య పరీక్షలు, రోజువారీగా నిర్వహిస్తున్న పరీక్షల సంఖ్య, పరీక్షలకు అవసరమైన సౌకర్యాల లభ్యతపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.
హన్వాడ పీహెచ్‌సీకి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో వైద్య సేవల నాణ్యత, మందుల లభ్యత, అవసరమైన సౌకర్యాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రగతి, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి: ఎస్పీ డి.జానకి






మిడ్జిల్,సెప్టెంబర్ 8, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):
గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ గణేష్ మండపాల నిర్వాహకులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీలు, మండప నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మండపాల ఏర్పాటు, భద్రత, విద్యుత్, లౌడ్ స్పీకర్లు, ట్రాఫిక్, నిమజ్జన ఊరేగింపుపై పలు సూచనలు చేశారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, 24 గంటలూ వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని, రహదారులు, ఫుట్‌పాత్‌లకు ఆటంకం కలిగించకుండా మండపాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ తెలిపారు. అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు వినియోగించరాదని, డీజేలకు అనుమతి లేదని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించరాదన్నారు. నిమజ్జన ఊరేగింపులో ఆయుధాలు, ప్రమాదకర వస్తువులు తీసుకెళ్లరాదని, పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాల భద్రతా సూచనలతో రూపొందించిన కరపత్రాలను ఎస్పీ ప్రదర్శించి నిర్వాహకులకు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712659360 లేదా 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వీఎచ్‌పీ నాయకులు, గణేష్ మండపాల నిర్వాహకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మర్రిగూడలో కరువు కాటు..
# రైతన్న విలవిల!

●కరువు మండలంగా ప్రకటించి ఆదుకోవాలి
●ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం వెంటనే ఇవ్వాలి
●తెదేపా మండల అధ్యక్షుడు దోమల వెంకటయ్య యాదవ్




మర్రిగూడెం సెప్టెంబర్ 8 (నేటి దర్శిని):
ఒకవైపు పెట్టుబడులు పెరిగి.. మరోవైపు వరుణుడు ముఖం చాటేయడంతో మర్రిగూడ మండల రైతన్న పరిస్థితి దయనీయంగా మారిందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు దోమల వెంకటయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేతికొస్తుందని ఆశతో అప్పులు చేసి ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసి సాగులో పెట్టుబడులు పెట్టిన రైతులకు వర్షాభావం తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని అన్నారు. పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, వారి కష్టాలను దృష్టిలో ఉంచుకుని మర్రిగూడ మండలాన్ని వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించి, ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మర్రిగూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకటయ్య యాదవ్ మాట్లాడుతూ.. రైతులు పెట్టుబడుల కోసం ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో భారీగా ఖర్చు చేశారని తెలిపారు. తగిన వర్షాలు లేకపోవడంతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారని పేర్కొన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు రాకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

**విద్యార్థుల జీవితాలతో చెలగాటమా?**

ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని వెంకటయ్య యాదవ్ ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన వివిధ పార్టీల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు.
ఈ కార్యక్రమంలో తెదేపా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలే మల్లేష్, ప్రధాన కార్యదర్శి పుప్పాల యాదయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు గునుగంటి శ్రీరాములు, బీసీ సెల్ అధ్యక్షుడు కాసర్ల అంజయ్య, వీరమల్ల మల్లేష్, వరికుప్పల శ్రీనివాస్, బరిగల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



ఆమనగల్లు, సెప్టెంబర్ 08(నేటి దర్శిని):
లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో మంగళవారం డా. దామోదర్ రెడ్డి 79 వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఘనంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు."రక్తదానం.. ప్రాణదానం"అనే సందేశం తో నిర్వహించిన ఈ శిబిరానికి యువత,, లయన్స్ క్లబ్ సభ్యులు మరియు స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేసి, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి తమ వంతు సహాయం అందించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ప్రమాద బాధితులు, శస్త్ర చికిత్సలకు,అవసరమైన రోగులకు, అత్యవసర వైద్యం పొందుతున్న వారికి ఎంతో మేలు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని క్యాంపు చైర్మన్ లయన్ భావండ్ల వెంకటేష్,ప్రారంభించగా క్యాంపు కో చైర్మన్ బండేల రామచంద్రారెడ్డి సహకరించారు.క్యాంపు కో ఆర్డినేటర్లుగా లయన్ చంద్రకాంత్ రెడ్డి,లయన్ వెంకట స్వామి, లయన్ బావండ్ల మధు వ్యవహరించారు.రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి,శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన వైద్య సిబ్బందికి మరియు లయన్స్ క్లబ్ సభ్యులకు క్లబ్ పిఆర్ఓ ఎంఏ.పాషా కృతజ్ఞతలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ, సెక్రటరీ గంగుల శ్రీనివాస్ రెడ్డి, ట్రెజరర్ గంప శ్రీనివాస్,లయన్ సభ్యులు లక్ష్మారెడ్డి, ఓంకారం,భాస్కర్ రెడ్డి,పాండు రెడ్డి, మధుసూదన్ రెడ్డి,జూలూరు లింగయ్య,కే .రామ్ రెడ్డి, వెంకటస్వామి,సుధీర్ రెడ్డి,కొండల్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి,రవీందర్ రెడ్డి,మదన్ గౌడ్,శివరాం,తదితరులు పాల్గొన్నారు.

## దళిత స్పీకర్‌పై నోరుజారిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ..
# పటాన్‌చెరులో కాంగ్రెస్ నిరసన గర్జన!








●బీఆర్ఎస్ ఎమ్మెల్సీని తక్షణమే సస్పెండ్ చేయాలి..
●రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాలి
కాట సుధా శ్రీనివాస్ గౌడ్

పటాన్‌చెరు సెప్టెంబర్ 8(నేటి దర్శిని)
దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసిన అనుచిత, అహంకారపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పటాన్‌చెరులో ఆందోళనకు దిగాయి. సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీకి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పటాన్‌చెరు డివిజన్‌లోని గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర శాసనసభకు సంబంధించిన రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నతమైన పదవులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని పేర్కొన్నారు. రాజకీయ భేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా, సామాజికంగా కించపరిచే వ్యాఖ్యలకు తావు ఇవ్వకూడదన్నారు.దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన్ను సస్పెండ్ చేయాలని కాట సుధా శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించే వారికి తగిన విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజాప్రతినిధులు తమ మాటలు, వ్యవహారశైలిలో హుందాతనాన్ని పాటించాలని, రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించాలని ఆమె సూచించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలకు స్థానం ఉన్నప్పటికీ, అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత నాయకత్వం బాధ్యత తీసుకోవాలని కోరారు.
రాజ్యాంగ విలువలు, సామాజిక గౌరవం, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలబడుతుందని ఆమె స్పష్టం చేశారు. దళితులు, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ సహించబోదని అన్నారు.
ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు

●మట్టి వినాయకులను పూజిద్దాం,పర్యావరణాన్ని కాపాడుదాం
●ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు, సెప్టెంబర్ 08(నేటి దర్శిని);
రాబోయే వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలందరికీ కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి శుభాకాంక్షలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించి, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి) విగ్రహాలు, హానికరమైన కెమికల్ రంగుల వల్ల మన చెరువులు, కుంటలు తీవ్రంగా కలుషితమవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన సాంప్రదాయం, మన ప్రకృతి రెండు మట్టిలోనే ఉన్నాయి. పూర్వం నుండి మన పూర్వీకులు మట్టి విగ్రహాలని పూజించేవారు. కాబట్టి స్వచ్ఛమైన మట్టి వినాయకులను పూజించి, నిమజ్జనం తర్వాత ఆ మట్టి తిరిగి ప్రకృతిలో కలిసేలా చేద్దామని, ఇది భక్తితో పాటు మన అందరి బాధ్యత అని సూచించారు. ఈ పండుగ వేల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ గణనాథుని ప్రార్థిస్తున్నాను అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలియజేశారు.

# ప్రజల కమ్యూనిటీ హాల్‌పై కబ్జా కోరలు..!

- లోకాయుక్త కాలనీ హాల్ అన్యాక్రాంతం
- అధికారుల మౌనం వెనుక మతలబేంటి.?
- అసోసియేషన్ లేదు, తాళాలు మాత్రం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో సైదాబాద్ లోకాయుక్త కాలనీ కమ్యూనిటీ హాల్‌పై అక్రమ ఆధిపత్యం
- కబ్జా దందాకు అధికారులు అండదండలా.?
- ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా పట్టించుకోని మలక్‌పేట్ సర్కిల్ అధికారులు
- తాళాలు ఎవరిచ్చారు.? కబ్జా ఎలా జరిగింది.?
- కబ్జాదారులకు జీహెచ్ఎంసీ ద్వారాలు తెరిచిందా.?
- ప్రజల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్‌పై అక్రమ ఆధిపత్యం




**మలక్ పేట్, సెప్టెంబర్08 (నేటి దర్శిని):** ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన ప్రభుత్వ ఆస్తులు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చార్మినార్ జోన్, మలక్‌పేట్ సర్కిల్‌లో సైదాబాద్ కాలనీలో ఉన్న లోక్‌ఆయుక్త కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రస్తుతం అన్యాక్రాంతమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ఉపయోగం కోసం నిర్మించిన ఈ భవనం ఇప్పుడు కొందరి ఆధీనంలో ఉండటం వెనుక అధికారుల నిర్లక్ష్యమా.? లేక తెరవెనుక వ్యవహారాలున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రజల కోసం నిర్మిస్తే.. కబ్జాదారుల కోసం వదిలేశారా.?**

సుమారు 12 ఏళ్ల క్రితం జీహెచ్ఎంసీ తన సొంత నిధులతో కాలనీ వాసుల అవసరాల కోసం కమ్యూనిటీ హాల్‌ను నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. కొంతకాలం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యకలాపాలు కొనసాగగా, సుమారు పదేళ్ల క్రితమే ఆ అసోసియేషన్ గడువు ముగిసిందని పేర్కొంటున్నారు. అప్పటి నుంచి కొత్త అసోసియేషన్ ఏర్పడకపోయినా కమ్యూనిటీ హాల్‌ను మున్సిపల్ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకుని పరిరక్షించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా పరిస్థితులు మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అసోసియేషన్ లేదు.. మరి తాళాలు ఎవరి చేతుల్లో.?**

అసోసియేషన్ లేకపోతే కమ్యూనిటీ హాల్ తాళాలు మున్సిపల్ అధికారుల వద్దే ఉండాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కానీ ప్రస్తుతం తాళాలు కొందరు వ్యక్తుల చేతుల్లోకి ఎలా వెళ్లాయి.? వారికి భవనాన్ని ఉపయోగించే అధికారం ఎవరు ఇచ్చారు.? జీహెచ్ఎంసీ నుంచి ఏమైనా అనుమతి ఉందా.? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఫిర్యాదులు ఫైళ్లలోనే, కబ్జా మాత్రం కొనసాగుతూనే**

కమ్యూనిటీ హాల్‌ను ఖాళీ చేయించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని పలుమార్లు మలక్ పేట్ సర్కిల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలక్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు విషయం తెలిసినా చర్యలు తీసుకోకపోవడంపై వారు మండిపడుతున్నారు. ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోకుండా అధికారులు మౌనం వహిస్తుండటంతోనే కబ్జాదారులకు మరింత ధైర్యం వస్తోందని ఆరోపిస్తున్నారు.

**మున్సిపల్ అధికారుల మౌనం ఎందుకు.?**

ప్రభుత్వ ఆస్తి పరిరక్షణలో అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. కమ్యూనిటీ హాల్‌పై ఎవరికైనా హక్కు లేదా వినియోగ అనుమతి ఉంటే సంబంధిత పత్రాలను అధికారులు బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా భవనాన్ని వినియోగిస్తుంటే తక్షణమే ఖాళీ చేయించి జీహెచ్ఎంసీ ఆధీనంలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

కొంతమంది స్థానికులు మాత్రం అధికారులు, సంబంధిత వ్యక్తుల మధ్య అంతర్గత ఒప్పందాలు జరిగాయా.? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కమ్యూనిటీ హాల్‌ను అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ఎవరికైనా అధికారులు సహకరించారా.? ప్రభుత్వ ఆస్తి వినియోగంపై ఏమైనా ఆర్థిక లావాదేవీలు జరిగాయా.? అనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే వీటికి సంబంధించిన వాస్తవాలను విజిలెన్స్ అధికారులు స్పష్టమైన విచారణ ద్వారా వెల్లడించాల్సి ఉంది.

**కమిషనర్ కర్ణన్ స్పందించాలి**




ప్రజాధనంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కబ్జా నుంచి కాపాడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీదే. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ కమిషనర్, చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ స్పందించి కమ్యూనిటీ హాల్‌పై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా భవనాన్ని వినియోగిస్తుంటే వెంటనే ఖాళీ చేయించి, తాళాలను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ప్రజల కోసం నిర్మించిన భవనం ప్రజలకే దక్కుతుందా? లేక కబ్జాదారుల ఆధీనంలోనే కొనసాగుతుందా.? అన్నది జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల చర్యలతో తేలాల్సి ఉంది.

# గణేష్ ఉత్సవాలపై పోలీసుల పకడ్బందీ నిఘా!

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలి: సీఐ రాజు, ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి



**చింతపల్లి సెప్టెంబర్ 8 (నేటి దర్శిని) :** గణేష్ ఉత్సవాల నేపథ్యంలో చింతపల్లి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈఉత్సవాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు గణేష్ ఉత్సవ నిర్వాహకులు, గ్రామ పెద్దలతో చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

సీఐ రాజు, ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాలను నిర్వాహకులు, గ్రామ పెద్దలకు వివరించారు. ఉత్సవాల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, శాంతిభద్రతలు, భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని పోలీసులు సూచించారు. పోలీసుల ఆదేశాలు, నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

# మక్తల్ నియోజకవర్గంలో నేడు డీకే అరుణమ్మ పర్యటన


బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి

**మిడ్జిల్, సెప్టెంబర్ 8, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణ, మాగనూర్, ఉట్కూర్ మండలాల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ నేడు పర్యటించనున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఆయా మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొంటారని పేర్కొన్నారు.

మాగనూర్ మండలం నేరడిగొం గ్రామం, కృష్ణ మండలం కృష్ణ గ్రామం, ఉట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పదాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు బ్రోచర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**మార్కాపురం, జిల్లా , (నేటి దర్శిని):** మార్కాపురం పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 11,12,13 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌కు పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రత, సమష్టి భావనను పెంపొందిస్తాయని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలను మార్కాపురంలో నిర్వహించడం స్థానికంగా క్రీడా వాతావరణాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ముఖ్యంగా పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. క్రీడాకారులకు వసతి, భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధితులకు సూచించారు..పోటీలు ప్రశాంత వాతావరణంలో, క్రీడా




నియమ నిబంధనలకు అనుగుణంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసే అధికారం ఎవరిచ్చారు

- మహిళా ఎమ్మెల్యేల పై దాడి అప్రజాస్వామికం
- మహిళా ఎమ్మెల్యేలకు రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఏంటి
- వెయ్యి రోజుల ప్రజాపాలనలో ప్రజల అవస్థలు



**రంగారెడ్డి జిల్లా , సెప్టెంబర్ 08 (నేటి దర్శిని):** మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసే అధికారం ఎవరిచ్చారుని మాజీ మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకురాలు ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద మహిళ ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యేల పై దాడి అప్రజాస్వామికమన్నారు.రాష్ట్రంలో మహిళా ఎమ్మెల్యేలకు రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వెయ్యి రోజుల ప్రజాపాలనలో ప్రజల అవస్థలు పడుతున్నారని, ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి, ఇచ్చిన హామీలను అమలు చేయమని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.


# మేడిగడ్డ తండాలో సర్ ప్రక్రియను పరిశీలించిన ఎంపీడీవో జైరామ్ విజయ్



**ఆమనగల్లు, సెప్టెంబర్ 08(నేటి దర్శిని);**
రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీ లో కొనసాగుతున్న సర్ ప్రక్రియను మంగళవారం మండల ఎంపీడీవో జైరాం విజయ్ పరిశీలించారు. తండాలో సర్ ప్రక్రియ కొనసాగుతున్న తీరును పరిశీలించి,అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్ల వివరాల పరిశీలన, నమోదు ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్,ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్, జిపిఓ మనీలా బిఎల్ఓ లు సరోజ,సరిత,వార్డు మెంబర్లు,గ్రామపంచాయతీ సిబ్బంది,తాండ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తాత మధును భర్తరఫ్ చేయాలి

- దళిత స్పీకర్‌ను అవమా నిస్తే సహించేది లేదు
- ఎమ్మెల్సీ నవీన్ పై క్రిమినల్ కేస్ పెట్టాలి
- మిడ్జిల్ మాజీ సర్పంచ్ శారద వెంకటయ్య డిమాండ్



మిడ్జిల్ గ్రామ మాజీ సర్పంచ్ బరిగెల శారద వెంకటయ్య

**మిడ్జిల్, సెప్టెంబర్ 8, (నేటి దర్శిని):**
రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న దళిత స్పీకర్ గడ్డం ప్ర సాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మె ల్సీ నవీన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను మిడ్జిల్ మాజీ సర్పంచ్ శారద వెంకటయ్య తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చే శారు. శాసనసభ స్పీకర్ పద వికి ఉన్న గౌరవాన్ని మరిచి అసభ్య పదజాలంతో వ్యా ఖ్యలు చేయడం ప్రజాస్వా మ్య విలువలకు విరుద్ధ మ న్నారు. దళిత స్పీకర్‌ను అవమానించడం అంటే యావత్ దళిత సమాజాన్ని అవమానించడమేనని అ న్నారు.తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు, దళిత స మాజానికి బహిరంగ క్షమా పణ చెప్పాలని శారద వెంకటయ్య డిమాండ్ చేశా రు. ఇందులో భాగంగానే తాత మధు ను పదవి నుండి భర్తరఫ్ చేయడంతో పాటు పదేళ్లపాటు ఎలాంటి పదవులకు పోటీ చేయకుం డ అనర్హత వేటు వేయాలని అన్నారు. అదే విధంగ ఎమ్మె ల్సీ నవీన్ కుమార్ పట్ల క్రిమినల్ కేసులు నమో దు చేసి సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేశారు. రాజ్యాం గబద్ధ పదవులను గౌరవిం చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు తమ అహంకార ధోరణిని విడనా డాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన సమాధానం చెబుతా రని శారద వెంకటయ్య హెచ్చరించారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికావు

- తాత మధు వెంటనే క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్ నాయకులు



**మిడ్జిల్, సెప్టెంబర్ 8, (నేటి దర్శిని):**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్పై తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం మిడ్జిల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తాత మధు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడుతూ.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఎస్సీ సామాజిక వర్గాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించేది లేదని స్పష్టం చేశారు.
తాత మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు, ఎస్సీ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే తాత మధు వ్యాఖ్యలపై కేసీఆర్, కేటీఆర్ కూడా స్పందించి బీఆర్ఎస్ పార్టీ తరఫున క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ టీ.జ్యోతి, మార్కెట్ డైరెక్టర్లు, జిల్లా నాయకులు, గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ యువజన నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రభుత్వ విధానాలు ప్రజల మధ్య పీఐబీ ద్విముఖ వారధి

- సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో మీడియా కీలకం: సిద్ధార్థ్ బోడ్కే
- సబర్మతి హైస్పీడ్ రైల్ హబ్, సీఈపీటీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన తెలంగాణ మీడియా బృందం



**అహ్మదాబాద్, సెప్టెంబర్ 8(నేటి దర్శిని):**
కేంద్ర ప్రభుత్వ విధానాలు, సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంతో పాటు క్షేత్రస్థాయి అభిప్రాయాలను ప్రభుత్వానికి చేరవేస్తూ పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య కీలకమైన ద్విముఖ వారధిగా పనిచేస్తోందని పీఐబీ అహ్మదాబాద్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) సిద్ధార్థ్ బోడ్కే అన్నారు. గుజరాత్‌లో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి ప్రాజెక్టులపై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ పీఐబీ ఆధ్వర్యంలో 10 మంది సభ్యులతో కూడిన తెలంగాణ మీడియా ప్రతినిధుల బృందం గుజరాత్ పర్యటన చేపట్టింది. పర్యటనలో భాగంగా తొలిరోజు అహ్మదాబాద్‌లోని కీలక మౌలిక వసతుల కేంద్రాలు, విద్యా సంస్థలు, చారిత్రక ప్రదేశాలను ప్రతినిధులు సందర్శించారు. పీఐబీ అహ్మదాబాద్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక బ్రీఫింగ్‌తో పర్యటన ప్రారంభమైంది. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడిన సిద్ధార్థ్ బోడ్కే. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు సమాచారాన్ని అందించడమే కాకుండా, ప్రజల నుంచి వచ్చే స్పందనను ప్రభుత్వానికి చేరవేయడంలో పీఐబీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.

**చారిత్రక వారసత్వం నుంచి ఆధునిక మౌలిక వసతుల వరకు**

మీడియా బృందం తొలుత మహాత్మా గాంధీ 1915లో దక్షిణాఫ్రికా నుంచి భారత్‌కు తిరిగి వచ్చిన అనంతరం ఏర్పాటైన చారిత్రక కొచ్‌రాబ్ ఆశ్రమాన్ని సందర్శించింది. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఆశ్రమానికి ఉన్న ప్రాధాన్యత, గాంధీజీ ఆలోచనల రూపకల్పనలో అది పోషించిన పాత్ర, చారిత్రక వారసత్వ పరిరక్షణ చర్యలను ప్రతినిధులకు వివరించారు. అనంతరం ఆవాస ప్రణాళిక, డిజైన్ రంగాల్లో ప్రముఖ విద్యాసంస్థగా పేరొందిన సీఈపీటీ విశ్వవిద్యాలయాన్ని బృందం సందర్శించింది. విశ్వవిద్యాలయ అధ్యక్షుడు ప్రొఫెసర్ బర్జోర్ మెహతా, సీనియర్ అధ్యాపకులు ప్రొఫెసర్ సాశ్వత్ బందోపాధ్యాయ, ప్రొఫెసర్ శాలిని సిన్హా, ప్రొఫెసర్ శివానంద్ స్వామి, ప్రొఫెసర్ సేజల్ పటేల్‌లతో జర్నలిస్టులు సమావేశమయ్యారు. పట్టణ ప్రణాళిక, రవాణా వ్యవస్థలు, సుస్థిర ఆవాస నిర్వహణ, వాస్తుశిల్పం తదితర రంగాల్లో విశ్వవిద్యాలయం చేపడుతున్న పరిశోధనలు, బహుళ విభాగాల విద్యా కార్యక్రమాలపై చర్చించారు. పర్యటనలో భాగంగా నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్) కార్యాలయాన్ని కూడా మీడియా బృందం సందర్శించింది. ముంబయి--అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ (ఎంఏహెచ్ఎస్ఆర్) ప్రాజెక్టులో జరుగుతున్న పనులపై ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆదిత్య సింగ్, ప్రజా సంబంధాల అధికారి అరుణ్ బరోట్ వివరించారు. అత్యాధునిక సబర్మతి హైస్పీడ్ రైల్ మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌ను కూడా ప్రతినిధులు పరిశీలించారు. హైస్పీడ్ రైల్ టెర్మినల్‌ను భారతీయ రైల్వేలు, అహ్మదాబాద్ మెట్రో రైల్, బస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (బీఆర్‌టీఎస్)తో అనుసంధానించే విధంగా ఈ హబ్‌ను రూపొందిస్తున్నారు. ప్రయాణికులు వివిధ రవాణా మార్గాల మధ్య సులభంగా, అంతరాయం లేకుండా మారేలా సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆధునిక ప్రయాణికుల సౌకర్యాలు, విశాలమైన పార్కింగ్ వసతులు, హరిత భవన ప్రమాణాలు ఈ మల్టీమోడల్ హబ్ ప్రత్యేకతలుగా ప్రతినిధులు పరిశీలించారు. మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, చారిత్రక వారసత్వం, ప్రభుత్వ సమాచార వ్యవస్థలపై ప్రత్యక్ష అవగాహన కల్పించేలా తెలంగాణ మీడియా ప్రతినిధుల గుజరాత్ పర్యటన కొనసాగుతోంది.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దాడి యత్నం.. తీవ్ర ఖండన!

- రాజకీయ విభేదాలు సహజమే..
- దాడులు అప్రజాస్వామికం
- బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్ రెడ్డి



**చింతపల్లి, సెప్టెంబర్ 8 (నేటి దర్శని) :**
రాజకీయ విభేదాలను రాజకీయంగానే ఎదుర్కోవాలి తప్ప వ్యక్తిగత దాడులకు పాల్పడటం ఎంతమాత్రం సమర్థనీయం కాదని బీఆర్ఎస్ పార్టీ చింతపల్లి మండల మాజీ అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ఫామ్‌హౌస్‌పై కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించారంటూ ఆరోపిస్తూ, ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు సహజమే అయినప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి నివాసంపై దాడికి ప్రయత్నించడం పూర్తిగా అప్రజాస్వామిక చర్య అని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలకు స్వస్తి పలికి రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.
అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ శాసనసభ్యుడు కె. శంకరయ్యపై కూడా చర్యలు తీసుకోవాలని చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడితే పార్టీ తరఫున చట్టపరంగా పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రచార కార్యదర్శి వింజమూరి రవి, ధేన్యతండ గ్రామ సర్పంచ్ రమావత్ కొండల్ నాయక్, సిమర్ల శ్రీను యాదవ్, దండేటికార్ ప్రసాద్, దాస్ నాయక్, వింజమూరి అబ్బయ్య, నల్ల శంకర్, చందర్ నాయక్, ధన్‌రాజ్, ఆరెకంటి జంగయ్య, వింజమూరి లక్ష్మయ్య, వింజమూరి కళ్యాణ్, నర్సింహా, వింజమూరి శంకర్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోడకొండ్లలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం!

- ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- కార్డుల పంపిణీని ప్రారంభించిన సర్పంచ్ కాశగోని వెంకటయ్య



**చింతపల్లి సెప్టెంబర్ 8 (నేటి దర్శిని) :**
ప్రజలకు మరింత మెరుగైన పౌర సేవలు అందించడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం గోడకొండ్ల గ్రామపంచాయతీలో ఘనంగా ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ కాశగోని వెంకటయ్య లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం కావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, పాలకమండలి సభ్యులు, లబ్ధిదారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండలో ఘనంగా 'ప్రజా వికాస ర్యాలీ'

## 5 వేల బైకులు, 11 వేల మందితో ప్రజా ప్రభంజనం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి '1000 రోజుల ప్రజా పాలన' పురస్కరించుకుని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో 'ప్రజా వికాస ర్యాలీ'
- వెయ్యి రోజుల పాలనపై ఎమ్మెల్యే బాలు నాయక్ అభివృద్ధి నివేదిక
- నియోజకవర్గానికి రూ.369 కోట్ల రుణమాఫీ, రూ.422 కోట్ల రోడ్ల నిర్మాణం,
- రూ.200 కోట్ల ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్.. గాలి మాటలతో కేటీఆర్, హరీష్‌రావ్ ప్రజలను మోసం చేయలేరు: బాలు నాయక్ నిప్పులు





**దేవరకొండ , సెప్టెంబర్ 08 ( నేటి దర్శిని):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలో నిర్వహించిన 'ప్రజా వికాస ర్యాలీ' అత్యంత వైభవంగా, జనసందోహం నడుమ సాగింది. స్థానిక శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ చరిత్రలోనే ఒక సంచలనంగా నిలిచింది. స్థానిక మార్కెట్ యార్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన, బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. సుమారు 5,000 బైకులు, 11,000 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళల భాగస్వామ్యంతో దేవరకొండ పట్టణం కాంగ్రెస్ జెండాలతో, కార్యకర్తల ఉత్సాహభరిత నినాదాలతో ఊగిపోయింది.

**ప్రజా వికాస ర్యాలీ -- కాంగ్రెస్ సంక్షేమ పాలనకు నిదర్శనం**

అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రసంగిస్తూ, ఈ భారీ జనసంద్రం కాంగ్రెస్ ప్రజా పాలనకు ప్రజలు ఇస్తున్న బలమైన మద్దతుకు స్పష్టమైన సాక్ష్యమని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక రాజకీయ ప్రదర్శన మాత్రమే కాదని, వెయ్యి రోజుల వ్యవధిలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందుంచిన ప్రగతి నివేదిక అని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో మాటలు ఉండవని, పనులు, ఆధారాలు, రికార్డులు మాత్రమే ఉంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**రైతాంగ సంక్షేమానికి పెద్దపీట**

వ్యవసాయ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేవరకొండ నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.369 కోట్ల మేర రైతు రుణమాఫీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. రైతులకు అదనపు ఆదాయం కల్పించే ఉద్దేశంతో సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నామని వివరించారు. ఎన్నో ఏళ్లుగా మిగిలిపోయిన గూడీజ, దిండి ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేసి, నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

**పేదల సంక్షేమం మరియు ఉచిత విద్యుత్ సేవలు**

నియోజకవర్గంలోని పేద కుటుంబాల ఆకలి తీర్చడమే ధ్యేయంగా 15,000 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేశామని, ప్రతి లబ్ధిదారునికి నెలకు 6 కిలోల సన్నబియ్యాన్ని క్రమం తప్పకుండా అందిస్తున్నామని బాలు నాయక్ చెప్పారు. గృహజ్యోతి పథకం ద్వారా 32,127 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా, నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తూ దాదాపు 3,000 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉంచామని వివరించారు.

**మహాలక్ష్మి పథకం మరియు విద్యా రంగంలో సంస్కరణలు**

మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు కల్పించిన ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం వల్ల వేలాది మందికి ఆర్థిక భారం తగ్గిందని, దేవరకొండ డిపో పరిధిలోనే ఇప్పటివరకు ప్రభుత్వం రూ.156 కోట్లు ఆర్టీసీకి చెల్లించిందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యా రంగాన్ని సరికొత్త స్థాయిలో తీర్చిదిద్దేందుకు కులుమంతలపహాడ్ వద్ద రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని, దేవరకొండ ప్రభుత్వ హైస్కూల్‌ను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా, ఐటీఐని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌గా ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు.

**మౌలిక వసతులు మరియు రహదారుల విస్తరణ**

రవాణా సౌకర్యాలను మెరుగుపరచేందుకు నియోజకవర్గంలో భారీగా నిధులు మంజూరు చేశామని తెలిపారు. ఆర్ అండ్ బి శాఖ ద్వారా 137 కిలోమీటర్లకు రూ.272 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా 115 కిలోమీటర్లకు రూ.150 కోట్లు కలిపి, మొత్తంగా 252 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి రూ.422 కోట్ల విలువైన పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు.

**బిఆర్ఎస్ పాలనపై ఎమ్మెల్యే ధ్వజం**

గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై ఎమ్మెల్యే బాలు నాయక్ నిప్పులు చెరిగారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న నాయకులు నియోజకవర్గానికి ఏమి చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజా జీవితాన్ని వదిలి ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని, కేటీఆర్, హరీష్ రావులు కేవలం గాలి మాటల రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల హామీలను బొందపెట్టినందుకే బిఆర్ఎస్ పార్టీకి దేవరకొండ ప్రజలు బైబై చెప్పారని ఎద్దేవా చేశారు.

**చేసిన పనికే కీర్తి రావాలి**

ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, జీవోలు, అధికారిక రికార్డులే ఏ హయాంలో ఎంత పని జరిగిందో చూపుతాయని బాలు నాయక్ అన్నారు. కేవలం ప్రచారపు మాటలతో చరిత్రను మార్చలేరని, చేసిన పనికే గుర్తింపు రావాలి తప్ప చేయని పనులకు క్రెడిట్ కోరకూడదని హితవు పలికారు. వెయ్యి రోజుల పాలన అనేది క్యాలెండర్‌లో మారిన సంఖ్య కాదని, ఇది ప్రజల జీవితాల్లో తెచ్చిన స్పష్టమైన మార్పు అని పేర్కొన్నారు. అభివృద్ధి కాగితాలకు పరిమితం కాకుండా ప్రజల కళ్ల ముందే కనిపిస్తోందని చెబుతూ ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల హామీల సాధనకు చలో హైదరాబాద్‌కు పిలుపు




**నాగోల్, సెప్టెంబర్08 (నేటి దర్శిని):** రాష్ట్రంలోని పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఈస్ట్ యాదవ్ నగర్‌లో పెన్షర్ల సంఘం నాగోల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీని అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న 6డీఏలను విడుదల చేయాడంతో పాటు హెల్త్ స్కీమ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని తీర్మాణం చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగు బాటు తప్పదని హెచ్చరించారు. ఈ నెల 10వ తేదీన ప్రభుత్వ హామీల అమలుకై హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియం వేదికగా తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెన్షనర్లు, విశ్రాంత ఉద్యోగులు బారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి హనుమంత రెడ్డి, కార్యదర్శి లక్ష్మి నరసింహ రావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్, కార్యదర్శి సత్యనారాయణ, వాసవీ కాలనీ కార్యదర్శి చెన్నయ్య, గండిపేట అధ్యక్షుడు ప్రతాప రెడ్డి, షాద్ నగర్ అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి సురేష్ కుమార్, హస్తినాపురం అధ్యక్షుడు నర్సిరెడ్డి, నాగోల్ శాఖ అధ్యక్షుడు బి.వి ప్రతాప రెడ్డి, కార్యదర్శి ఏలూరి అశోక్ కుమార్ రావు, కోశాధికారి వి. అశోక్, నరసింహారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జగన్నాథం, లాలయ్య గౌడ్, మహేశ్వరీ దేవి, సుబ్బారావు, పీ .సత్యనారాయణ, లక్ష్మయ్య, బాల కృష్ణా రెడ్డి పలువురు జేఏసీ నేతలు పాల్గొన్నారు.

## శాఖపురం ఎక్స్‌రోడ్డులో రోడ్డు ప్రమాదం

- ఎక్సెల్ బైక్‌ను ఢీకొన్న స్విఫ్ట్ డిజైర్.. వ్యక్తికి తీవ్ర గాయాలు





**నిడమానూరు, సెప్టెంబర్ 8 (నేటి దర్శిని):** నిడమానూరు మండల కేంద్రంలోని శాఖపురం ఎక్స్‌రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పార్వతిపురం గ్రామానికి చెందిన మన్నెపల్లి ఆంజనేయులు ఎక్సెల్ బైక్‌పై నిడమానూరు నుంచి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.స్థానికుల వివరాల ప్రకారం.. ఆంజనేయులు శాఖపురం వైపు రోడ్డు దాటుతున్న సమయంలో మిర్యాలగూడ వైపు నుంచి వస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు అతని బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు రెండు కాళ్లకు తీవ్ర గాయాలై, ఎముకలు విరిగినట్లు సమాచారం. ప్రమాద తీవ్రతతో ఆయన రోడ్డుపై పడిపోగా, స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన ఆంజనేయులను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపినట్లు స్థానికులు పేర్కొన్నారు. కాగా, ప్రమాదానికి కారణమైన స్విఫ్ట్ డిజైర్ కారు (టీఎ 04 జుజె 7709)ను నడిపిన వ్యక్తి ప్రమాదం అనంతరం కారును అక్కడే వదిలి పరారైనట్లు పోలీసులు తెలిపారు. గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామానికి చెందిన నల్ల ఆంజనేయులు కారును నడుపుతున్నట్లు పోలీసు సిబ్బంది వెల్లడించారు.ప్రమాదంపై నిడమానూరు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, డ్రైవర్ ఆచూకీపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును నిడమానూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐడపీఆర్‌లో నిరసన




**హైదరాబాద్, సెప్టెంబర్08 (నేటి దర్శిని):** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టి.జి.ఈ.జె.ఏ.సీ. ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న నిర్వహించనున్న "చలో హైదరాబాద్--మహా ధర్నా" కార్యక్రమానికి మద్దతుగా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయ ఆవరణలో మంగళవారం "లంచ్ అవర్ డెమోన్స్ట్రేషన్" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాఖ ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొని తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు సంబంధించిన ప్రధాన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏల విడుదల, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు, జీపీఎఫ్ బకాయిల విడుదల, ఈహెచ్ఎస్ ఆరోగ్య పథకం అమలు తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. సెప్టెంబర్ 10న నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో టి.జి.ఈ.జె.ఏ.సీ. హైదరాబాద్ సిటీ కన్వీనర్ కందూరి వెంకట్, చైర్మన్ కట్కూరి శ్రీకాంత్, టి.జి.ఓ. నాయకులు కృష్ణయాదవ్, వనజ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సమాచార శాఖ ఉన్నతాధికారులు డి. శ్రీనివాస్, ఎస్.వెంకటేశ్వర్‌రావు, హాష్మి, జైరాంమూర్తి, యామిని, సంపత్, గోవర్ధన్ తదితరులు, టీఎన్జీఓస్ ఐడపిఆర్ యూనిట్ కార్యవర్గ సభ్యులు డి. జితేందర్, సి. నాగరాజు, రాజకుమార్, అఖిల్, ఎ. అనిల్, ఎం. మీనాక్షి, ఇందిరా, టి. దుర్గాప్రసాద్, టి. స్వర్ణలత, చిరంజీవి, శ్రీకాంత్‌తో పాటు సమాచార శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేజీబీవీ మిడ్జిల్‌లో ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ వేడుకలు






**మిడ్జిల్, సెప్టెంబర్ 8, (నేటి దర్శిని):** అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని మిడ్జిల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో అక్షరాస్యత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రత్యేక అధికారి కవిత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, విద్యార్థినులకు ఉపన్యాస, వ్యాస రచన పోటీలు నిర్వహించడం జరిగింది, విద్యార్థులకు అక్షరాస్యత ప్రాముఖ్యత, విద్య యొక్క ఆవశ్యకతపై అవగాహన కల్పించారు, విద్యతోనే వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ ప్రగతి సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థినులు అక్షరాస్యతపై అవగాహన కల్పించే కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి అక్షరాస్యతను పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కవిత, ఉపాధ్యాయినీ బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికావు

- తాత మధు, కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మల దహనం



**తలకొండపల్లి, సెప్టెంబర్ 8, ( నేటి దర్శిని):** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం తలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చెన్నకేశవులు ఆధ్వర్యంలో తాత మధు, కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా చెన్నకేశవులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అన్నారు. తాత మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్పీకర్‌కు, దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి మోహన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు భగవాన్ రెడ్డి, జిల్లా డీసీసీ కార్యదర్శి రఘురాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డేవిడ్, పబ్బతి వెంకటయ్య, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి డిగ్రీ కృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చెన్నకేశవులు, గ్రామ అధ్యక్షులు రమేష్, మాజీ ఎంపీటీసీ, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జోగు రమేష్, కటిక నరేష్, ఎన్ఎస్‌యూఐ తాలూకా ప్రధాన కార్యదర్శి తిరుపతి, మండల మైనారిటీ అధ్యక్షులు ఆరిఫ్ ఎక్బల్, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్, రాజేందర్ నాయక్, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- మహబూబ్‌నగర్‌లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ అవగాహన ర్యాలీ








**మిడ్జిల్ , సెప్టెంబర్ 8, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ) :** అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి సాధ్యమని, ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో NILP--ULLAS కార్యక్రమంలో భాగంగా అక్షరాస్యత అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యత కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడమే కాకుండా వ్యక్తి సాధికారతకు, కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి పునాది అని పేర్కొన్నారు. నిరక్షరాస్యత నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదవాలి--ప్రతి ఒక్కరూ ఎదగాలి అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ర్యాలీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్పీ సీఈఓ వెంకట రెడ్డి, డీఈఓ విజయ కుమారి, డీఆర్డీఓ నర్సింహులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఆగమన్ పేరుతో.. ప్రజలు ఆగమాగం






- ఊరేగింపులతో ట్రాఫిక్ జామ్ లు.. రోడ్లపై నరకం
- బ్యాండ్ బాజాలతో భక్తి రాదు.. ప్రజల చెవులు పగలగొట్టడం తప్పా.?
- మండపాల పేరుతో గల్లీలు బంద్.. అంబులెన్సులకూ దారేది.?
- భక్తి పేరుతో ప్రజలకు ప్రత్యక్ష నరకయాతనా.?
- భక్తా.. బల ప్రదర్శనా.? ఆగమన్‌లో విచ్చలవిడి ఖర్చులెందుకు.?

**హైదరాబాద్, సెప్టెంబర్08 (నేటి దర్శిని):** భక్తి అంటే పూజలు.. భక్తి అంటే అన్నదానం.. భక్తి అంటే ఆధ్యాత్మిక చింతన.. భక్తి అంటే హిందూ ధర్మం, సంస్కృతి అభివృద్ధికి తోడ్పడటం. కానీ ప్రస్తుతం కొందరి నిర్వాహకుల తీరు చూస్తుంటే భక్తి పేరుతో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేయడమే లక్ష్యంగా మారిందన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఆగమన్, నిమజ్జనం పేరుతో భారీ బ్యాండ్లు, ప్యాడ్ బ్యాండ్లు, డీజే తరహా శబ్దాలతో పాటు కళ్ళు పోయేలా ఎల్ఈడి ఫోక్సింగ్ లైట్లు నగరవాసుల సహనానికి పరీక్ష పెడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. గల్లీ నుంచి ప్రధాన రహదారి వరకు ఇష్టారాజ్యంగా మండపాలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆటోలు వెళ్లడానికి కూడా ఇబ్బంది ఏర్పడుతుండగా, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ ఎలా వెళ్లాలి.? అన్న ప్రశ్న తలెత్తుతోంది. మండపాల ఏర్పాటు సమయంలో ప్రజలకు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ గల్లీ నాయకుల కొంతమంది ప్రజాప్రతినిధుల వత్తిడితో నిబంధనలను గాలికి వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనితో అనుమతుల విషయంలో నిబంధనలు ఎంతవరకు అమలవుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### డీజేకు పేరు మార్చితే శబ్దం తగ్గుతుందా.?

డీజేలకు అనుమతి లేదనే నిబంధనలను తప్పించుకునేందుకు కొందరు నిర్వాహకులు 'ప్యాడ్ బ్యాండ్' పేరుతో భారీ సౌండ్ సిస్టమ్స్ ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెవులు పగిలేంత శబ్దంతో గంటల తరబడి సౌండ్ పెట్టడం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. శబ్ద కాలుష్య నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు, పోలీసులు ఇలాంటి వ్యవహారాలపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం చాలా ఉంది.

### రంగురంగుల లైట్లతోనూ ఇబ్బందులే

భక్తి పేరుతో భారీగా రంగురంగుల లైట్లు ఏర్పాటు చేయడం కూడా కొన్ని ప్రాంతాల్లో వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. దానితోపాటు ఎల్ఈడి ఫోక్సింగ్ లైట్లు ఏర్పాటు చేయడంతో కళ్ళ పైన భరించలేని వెలుతురు పడడంతో కళ్ళు ఒక్క సారిగా చీకటిగా మారుతూ దృష్టి దోషాలు ఏర్పడుతున్నాయి. కళ్లకు ఇబ్బంది కలిగించే విధంగా లైట్లను రోడ్ల వైపు తిప్పడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### భక్తా.. బల ప్రదర్శనా.?

గణేశ్ ఆగమన్, నిమజ్జనం కార్యక్రమాల పేరుతో భారీగా డబ్బు ఖర్చు చేయడం, భారీ బ్యాండ్లు, భారీ లైట్లు, భారీ ఊరేగింపులు నిర్వహించడం భక్తి ప్రదర్శనా.? లేక ఆర్థిక, బల ప్రదర్శనా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరికొన్ని చోట్ల ఆగమన్, నిమజ్జనం సందర్భంగా కొందరు మద్యం సేవించి చిందులు వేస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇది భక్తి పేరుకు ఎంతవరకు న్యాయం చేస్తుందో నిర్వాహకులే ఆలోచించాలి. మరి ఇంత డబ్బు ఎక్కడి నుండి వస్తుంది.? అన్నదానిపై కూడా అధికారులు దృష్టి పెట్టవలసిన అవసరం చాలా ఉంది.

### భక్తి అంటే నలుగురికీ మంచిని చేయాలి

తన భక్తితో పాటు నలుగురికీ మంచి కలిగేలా పండుగ జరుపుకోవడం సంప్రదాయం. కానీ ప్రస్తుతం కొందరి తీరు కారణంగా భక్తి పేరుతో నలుగురినీ అనేక ఇబ్బంది పెట్టే పరిస్థితి ఏర్పడుతున్నాయి. పండుగ జరుపుకోవడాన్ని ఎవరూ వ్యతిరేకించరు. అయితే ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా, అత్యవసర వాహనాలకు దారి ఉండేలా, శబ్ద కాలుష్యం లేకుండా ఉత్సవాలు నిర్వహించడమే నిజమైన బాధ్యతాయుతమైన భక్తి అన్న విషయం నిర్వాహకులు మర్చిపోకూడదు.

**ప్రభుత్వం పోలీసులు కఠినంగా వ్యవహరించక తప్పదు**
**ప్రభుత్వం, పోలీసులు ఇప్పటికైనా కఠినంగా వ్యవహరించి స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలి. లేకపోతే ప్రతి సంవత్సరం ఆగమన్, నిమజ్జనం పేరుతో ఇదే గందరగోళం పునరావృతమయ్యే ప్రమాదం ఉంది. భక్తి పేరుతో ప్రజల సహనాన్ని పరీక్షించే పరిస్థితులకు ఇప్పటికైనా చెక్ పెట్టాల్సిన సమయం వచ్చింది.**

## మిడ్జిల్‌లో మార్మోగిన ఈదమ్మ-పోచమ్మ నామస్మరణ







**మిడ్జిల్, సెప్టెంబర్ 8 (నేటి దర్శిని):** మిడ్జిల్ మండల కేంద్రంలో గ్రామ దేవతలైన శ్రీశ్రీశ్రీ ఈదమ్మ, పోచమ్మ తల్లుల బోనాల పండుగను గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలతో ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని



ప్రత్యేకంగా ప్రార్థించారు. ఈదమ్మ--పోచమ్మ తల్లుల ఆశీస్సులతో గ్రామంలో శాంతి, సౌభాగ్యం, సిరిసంపదలు వెల్లివిరియాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. బోనాల కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేశారు.


# చిరంజీవి 'కాకా'లో అనస్వర రాజన్..

## - ఎంబీబీఎస్ స్టూడెంట్‌గా ఫస్ట్ లుక్ అదిరింది!




మలయాళం ఇండస్ట్రీలో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయిక అనస్వర రాజన్ ఇప్పుడు తెలుగులో వరుస అవకాశాలతో బిజీగా మారుతోంది. ఇప్పటికే తెలుగు ప్రేక్షకులకు దగ్గరవుతున్న ఈ మలయాళీ బ్యూటీ.. తాజాగా మరో తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో టాలీవుడ్‌లో ఆమె జోరు మరింత పెరిగినట్లు కనిపిస్తోంది.ప్రస్తుతం అనస్వర రాజన్ చేతిలో ఉన్న ప్రాజెక్టుల్లో 'కాకా' మాత్రం ఆమె కెరీర్‌లోనే అత్యంత కీలకమైన చిత్రంగా నిలవనుంది. మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ఈ భారీ సినిమాలో అనస్వర ఓ కీలకమైన పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాలో ఆమె పోషిస్తున్న పాత్రపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా ఆమె పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది.అనస్వర రాజన్ పుట్టినరోజు సందర్భంగా 'కాకా' చిత్రబృందం ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో అనస్వరను ఎంబీబీఎస్ విద్యార్థిని అమ్ములుగా పరిచయం చేశారు. చాలా సహజమైన, హోమ్లీ లుక్‌లో కనిపిస్తున్న ఆమె ఫస్ట్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సాధారణ గ్లామర్ లుక్‌కు భిన్నంగా.. ఓ మెడికల్ స్టూడెంట్‌గా అనస్వరను చూపించడం ప్రత్యేకంగా నిలిచింది. ఆమె పాత్ర సినిమాకు కథాపరంగా ఎంత ముఖ్యమో పోస్టర్‌లోనే హింట్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా అనస్వర వెనుక భాగంలో నీడలా కనిపిస్తున్న చిరంజీవి పాత్ర.. ఈ సినిమాలో వీరిద్దరి మధ్య ఉన్న బంధంపై ఆసక్తిని పెంచుతోంది.'కాకా' సినిమాలో అనస్వర రాజన్ చిరంజీవి కూతురు 'అమ్ములు' పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. తండ్రి-కూతుళ్ల అనుబంధం సినిమాకు కీలకమైన ఎమోషనల్ పాయింట్‌గా ఉండే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఫస్ట్ లుక్‌లో చిరంజీవిని నేరుగా చూపించకుండా ఆయన నీడను మాత్రమే హైలైట్ చేయడం ద్వారా.. అమ్ములు జీవితంలో ఆయన పాత్ర ఎంత కీలకమో చెప్పే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది. దీంతో సినిమాలో అనస్వర పాత్ర కేవలం గ్లామర్ కోసమే కాకుండా కథలో బలమైన ప్రాధాన్యత కలిగి ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మలయాళ సినిమాలతో కెరీర్ ప్రారంభించిన అనస్వర రాజన్.. ఇప్పుడు టాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులను దక్కించుకుంటోంది. ఇప్పటికే ఆమె నటించిన తెలుగు చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంటుండగా.. తాజాగా 'అంతా రాములోరు చూసుకుంటారు' చిత్రానికి కూడా సైన్ చేసింది.దీంతో తెలుగులో ఆమె చేయబోయే సినిమాల సంఖ్య నాలుగుకు చేరినట్లు తెలుస్తోంది. అయితే వీటిలో 'కాకా' మాత్రం భారీ స్టార్ హీరోతో కలిసి నటిస్తున్న కారణంగా ఆమె కెరీర్‌కు మరింత కీలకంగా మారనుంది.మెగాస్టార్ చిరంజీవి వంటి సీనియర్ స్టార్‌తో కలిసి నటించే అవకాశం రావడం అనస్వరకు పెద్ద ప్లస్‌గా మారనుంది. ముఖ్యంగా తండ్రి-కూతుళ్ల బంధం చుట్టూ కథనం సాగితే.. ఆమె నటనకు మంచి స్కోప్ ఉండే అవకాశం ఉంది.

# సెన్సార్ పూర్తి చేసుకున్న సుమంత్ 'మహేంద్రగిరి వారాహి'.!




వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో సుమంత్ నటిస్తున్న తాజా చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'యు/ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది.ఈ చిత్రంలో సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి, ఐశ్వర్య రాజేష్ మరియు మాళవికా నాయర్ నటిస్తుండగా, వెన్నెల కిషోర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. అప్నా రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను రాగమయూరి ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిలిప్స్ బ్యానర్‌లపై మధు కాలిపు నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఓటీటీ రిలీజ్ ఫిక్స్.

## - నెట్‌ఫ్లిక్స్‌లో ఈ తేదీ నుంచి స్ట్రీమింగ్!





కోలీవుడ్ స్టార్ హీరో సూర్య వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. తమిళంతో పాటు తెలుగులోనూ మంచి మార్కెట్, భారీ ఫాలోయింగ్ ఉన్న సూర్య.. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తన సినిమాల పరిధిని మరింత పెంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన హీరోగా నటించిన లేటెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. టాలెంటెడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాలో సూర్యకు జోడీగా మమితా బైజు నటించారు. ఆగస్టులో థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంది. ముఖ్యంగా కథలోని భావోద్వేగ అంశాలు, కుటుంబ అనుబంధాలను దర్శకుడు తెరకెక్కించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకున్నట్లు టాక్ వచ్చింది.విశ్వనాథ్ అండ్ సన్స్' థియేట్రికల్ రన్ దాదాపుగా పూర్తవుతున్న నేపథ్యంలో.. ఇప్పుడు డిజిటల్ రిలీజ్‌పై అధికారికంగా క్లారిటీ వచ్చింది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.తాజా సమాచారం ప్రకారం సెప్టెంబర్ 11 నుంచి 'విశ్వనాథ్ అండ్ సన్స్' నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. దీంతో థియేటర్లలో సినిమాను మిస్ అయిన ప్రేక్షకులతో పాటు మరోసారి కుటుంబ సమేతంగా ఈ ఎమోషనల్ డ్రామాను చూడాలనుకునే వారికి ఓటీటీ ద్వారా అవకాశం లభించనుంది. ఓటీటీ రిలీజ్ విషయంలోనూ మేకర్స్ ప్రత్యేకంగా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా కేవలం ఒరిజినల్ తమిళ భాషలో మాత్రమే కాకుండా పలు డబ్బింగ్ వెర్షన్లలోనూ అందుబాటులోకి రానుంది. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో కూడా 'విశ్వనాథ్ అండ్ సన్స్'ను ప్రేక్షకులు వీక్షించవచ్చు. దీంతో ఈ సినిమా రీచ్ మరింత విస్తరించే అవకాశం ఉంది. ప్రత్యేకంగా తెలుగు ప్రేక్షకులకు కూడా సినిమా అందుబాటులోకి రానుండటంతో.. సూర్య అభిమానులతో పాటు వెంకీ అట్లూరి సినిమాలను ఇష్టపడే ప్రేక్షకుల్లోనూ ఆసక్తి నెలకొంది.'విశ్వనాథ్ అండ్ సన్స్'లో సూర్య, మమితా బైజు జోడీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఫ్యామిలీ ఎమోషన్స్‌కు ప్రాధాన్యత ఇచ్చిన కథలో వీరి పాత్రలు కథనానికి అనుగుణంగా సాగుతాయని తెలుస్తోంది.ముఖ్యంగా సూర్య తన స్టార్ ఇమేజ్‌కు భిన్నంగా ఎమోషనల్ టచ్ ఉన్న పాత్రలో కనిపించడం సినిమాకు ప్రత్యేకతగా నిలిచిందనే టాక్ వినిపించింది. మరోవైపు మమితా బైజు కూడా తన పాత్రకు తగినట్లుగా నటించి ఆకట్టుకున్నట్లు ప్రేక్షకుల నుంచి స్పందన వచ్చింది.

# మరో మల్టీప్లెక్స్‌ను ప్లాన్ చేస్తున్న విజయ్ దేవరకొండ..


## హైదరాబాద్‌లో ఏర్పాటుపై కసరత్తు!

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ సినిమా థియేటర్ల వ్యాపారాన్ని విస్తరించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అల్లు అర్జున్, మహేశ్ బాబు, రవితేజ వంటి అగ్ర కథానాయకులు రెండేసి మల్టీప్లెక్స్‌లతో తమ వ్యాపారాన్ని విస్తరిస్తుండగా తాజాగా అదే బాటలో రౌడీ హీరో కూడా నడవబోతున్నట్లు తెలుస్తుంది. ఏషియన్ గ్రూప్‌తో కలిసి ఇప్పటికే మహబూబ్‌నగర్‌లో 'ఏవీడీ సినిమాస్' పేరుతో ఒక అత్యాధునిక మల్టీప్లెక్స్‌ను నిర్వహిస్తున్న ఆయన, ఇప్పుడు మరో కొత్త మల్టీప్లెక్స్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.నార్త్ హైదరాబాద్‌లోని ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకుని మేడ్చల్ లేదా మల్కాజ్‌గిరి ప్రాంతంలో ఈ కొత్త మల్టీప్లెక్స్‌ను నిర్మించాలని ఆయన యోచిస్తున్నట్లు సినీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే, ఈ ప్రణాళిక ప్రస్తుతం ప్రాథమిక దశలోనే ఉందని, త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.



# యష్ 'టాక్సిక్'కు ఓటీటీ షాక్..

## రూ.150 కోట్ల ఆఫర్ నుంచి రూ.30 కోట్లకు పడిపోయిందా?



కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కిన పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. 'కేజీఎఫ్ 2' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత యష్ నటించిన సినిమా కావడంతో ఈ మూవీపై దేశవ్యాప్తంగా భారీ హైప్ ఏర్పడింది. అయితే థియేటర్లలో మాత్రం సినిమా ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించలేకపోయిందనే టాక్ వచ్చింది. ఇప్పుడు అదే ప్రభావం 'టాక్సిక్' డిజిటల్ రైట్స్‌పై పడినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విడుదలకు ముందు భారీ మొత్తంలో ఓటీటీ సంస్థలు ఆఫర్లు ఇచ్చినప్పటికీ.. సినిమా ఫలితం తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందనే వార్తలు వినిపిస్తున్నాయి.టాక్సిక్'పై విడుదలకు ముందు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం సుమారు రూ.150 కోట్ల ఆఫర్ చేసినట్లు సమాచారం. యష్ క్రేజ్‌తో పాటు సినిమాకు ఉన్న భారీ బజ్, టీజర్‌లో కనిపించిన బోల్డ్ కంటెంట్, స్టార్ హీరోయిన్ల గ్లామర్ వంటి అంశాలు ఈ ఆఫర్‌కు కారణమని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఆ సమయంలో ఈ ఆఫర్‌ను మేకర్స్ తిరస్కరించినట్లు తెలుస్తోంది. థియేటర్లలో సినిమా భారీ విజయం సాధిస్తే డిజిటల్ రైట్స్ విలువ మరింత పెరిగి రూ.200 కోట్ల వరకు వెళ్లే అవకాశం ఉందని భావించినట్లు టాక్. కానీ బాక్సాఫీస్ ఫలితం అంచనాలకు భిన్నంగా రావడంతో ఇప్పుడు లెక్కలు పూర్తిగా మారిపోయినట్లు తెలుస్తోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం 'టాక్సిక్' డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్ కోసం జీ5 సుమారు రూ.30 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. విడుదలకు ముందు వచ్చిన రూ.150 కోట్ల ఆఫర్‌తో పోలిస్తే ఇది చాలా తక్కువ మొత్తం. అంటే సినిమా విడుదలకు ముందు ఉన్న అంచనాలు, విడుదల తర్వాత వచ్చిన ఫలితం ఓటీటీ మార్కెట్‌పై ఎంత ప్రభావం చూపించాయో ఈ సంఖ్యలు చెబుతున్నాయని ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే రూ.150 కోట్ల ఆఫర్, రూ.30 కోట్ల ప్రస్తుత ఆఫర్‌కు సంబంధించిన వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అందువల్ల ఇవి ప్రస్తుతం మీడియా, ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారంగానే చూడాల్సి ఉంటుంది. పాన్ ఇండియా సినిమాలకు థియేట్రికల్, ఓటీటీతో పాటు శాటిలైట్ రైట్స్ కూడా కీలక ఆదాయ వనరుగా ఉంటాయి. అయితే 'టాక్సిక్' విషయంలో 'ఏ' సర్టిఫికెట్ కంటెంట్ కారణంగా టెలివిజన్ ప్రసారానికి కొన్ని సమస్యలు ఎదురవుతున్నట్లు సమాచారం.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365